ANDHRA PRADESH GAS DISTRIBUTION CORPORATION LTD

Andhra Jyothi, Hyderabad
Saturday, September 26, 2015

# 21వ శతాబ్దం ఎల్ఎన్జీదే..



ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న గెయిల్, జిడిఎఫ్ సూయిజ్ ప్రతినిధులు

- ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- 18 నెలల్లో కాకినాడ పోర్టులో ఎల్ఎన్జి టెర్మినల్
- ఎజిజిడిసి, షెల్, సూయెజ్, గెయిల్ సంస్థల మధ్య రెండు ఒప్పందాలు

విజయవాడ (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అంతా ఎల్ఎన్జీదేనని, పద్దెనిమిది నెలల్లో కాకినాడ పోర్టు దగ్గర ఎల్ఎన్జి టెర్మినల్ నిర్మాణం పూర్తి కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కాకినాడ డీప్ వాటర్ పోర్టు దగ్గర ఎల్ఎన్జి రీగ్యాసిఫికేషన్ టెర్మినల్ ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రి సమక్షంలో రెండు వేర్వేరు ఒప్పందాలు కుదిరాయి. ఆంధ్రప్రదేశ్ గ్యాస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిజిడిసి), గెయిల్, జిడిఎఫ్ సూయెజ్, షెల్ సంస్థల మధ్య సంయుక్త భాగస్వామ్య ఒప్పందాలపై సంతకాల కార్యక్రమం జరిగింది.

ముందుగా ఎల్ఎన్జి రీగ్యాసిఫికేషన్ టెర్మినల్ ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందంపై ఎపిజిడిసి, షెల్, జిడిఎఫ్ సూయెజ్ సంస్థలు సంతకాలు చేశాయి. ఎల్ఎన్జి టెర్మినల్ కంపెనీలో ఎపిజిడిసికి 48 శాతం వాటా ఉండగా.. షెల్, సూయెజ్ సంస్థలకు చెరి 26 శాతం వాటా చొప్పున వాటా ఉంటుంది. ఆ తర్వాత ఎల్ఎన్జి సప్లై-గ్యాస్ మార్కెటింగ్ కంపెనీ ఏర్పాటుకు సంబంధించి గెయిల్, సూయెజ్, షెల్ సంస్థల మధ్య మరో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ప్రాజెక్టులో గెయిల్‌కు 48 శాతం వాటా, షెల్, సూయెజ్ సంస్థలకు చెరో 26 శాతం చొప్పున వాటా ఉంటుంది. కాకినాడ టెర్మినల్ ద్వారా అందుబాటులోకి వచ్చే గ్యాస్ ఎల్ఎన్జి గ్యాస్‌కి తామే మార్కెట్ కల్పిస్తామని చంద్రబాబు అభయమిచ్చారు. కాకినాడ-శ్రీకాకుళం, కాకినాడ-నెల్లూరుకు రెండు గ్యాస్ పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రాజెక్టులు చేపడుతున్నామని చెప్పారు. ఎపిలోని 13 జిల్లాల్లో కూడా గ్యాస్ పైపులైన్లను ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ప్రతి నగరం, పట్టణాలను కలుపుతూ గ్యాస్ పైపులైన్లను ఏర్పాటు చేస్తామన్నారు. కృష్ణా, తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఇప్పటికే నగరాలు, పట్టణాలను కలుపుతూ గ్యాస్ పైపులైన్లను ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ టెర్మినల్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి మొదటి కేబినెట్ సమావేశంలోనే చంద్రబాబు సానుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల ఏర్పాటుకు గెయిల్ సంస్థ యాంకర్ రోల్ పోషించిందని చంద్రబాబు ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ విస్తారమైన సీ కోస్ట్‌ను కలిగి ఉందన్నారు. పోర్టుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోందని చెప్పారు.